# మెరవని తారకలు

ప్రకృతి చెక్కిలిమీద చీకటి చారిక పడింది. రుక్మిణి గుండెల్లో దుఃఖ కడలి పొంగింది. ఒడిలోని పాపాయి విలక్షణమైన ఏడుపు. విచిత్రమైన భంగిమ. కాంతిలేని కళ్ళు. వయసుతోపాటు ఎదగని శరీరం, మెదడు.... తన బ్రతుకులోని పెద్ద అపశ్రుతి వికృతంగా వినిపించి కంపించింది రుక్మిణి హృదయం. తన రక్తాన్ని పంచుకుని పుట్టిన ఆ బిడ్డను చూస్తున్న కొద్దీ తెలిసి తెలిసి తను చేసిన పొరపాటు కళ్ళ ముందు కదిలింది. అందర్నీ ఎదిరించి పోరాడి చివరివరకు నిలబడి నెగ్గించుకోలేక పోయిన తన అసమర్థతకు. పిరికితనానికి తనను తాను అసహ్యించుకుంది. కాలం కాటుకు తనను తాను అర్పించుకున్న నిస్సహాయస్థితి గుర్తుకొచ్చింది.

భవిష్యత్తు గురించి సుందర స్వప్నాల్ని కంటూ జీవితంలోని ఎత్తుపల్లాలేమిటో తెలియకుండా హాయిగా చదువుకుంటున్న రుక్మిణి హఠాత్తుగా తనముందు నిలిచిన సమస్యను చూచి కంగారుపడిపోయింది. బి.ఎస్.సి., ఎమ్.ఎస్.సి., పి.హెచ్.డి. చేసి గొప్ప సైంటిస్ట్ అవాలని కలలు కంటున్న రుక్మిణి బి.ఎస్.సి. కూడా దాటకుండానే చదువు నాపవలసిన పరిస్థితి వచ్చింది. ఆర్థిక పరిస్థితి తారుమారవడంతో వెంటనే రుక్మిణి పెళ్ళి చేసేసి తమ బాధ్యతను వదిలించుకోవడానికాత్రుత పడసాగారామె తల్లి దండ్రులు.

"అదికాదమ్మా! అసలా చంద్రానికి నాకూ పెళ్ళి అనే మాటను ఎవరమూ ఎప్పుడూ అనుకోలేదు కదా! చంద్రాన్ని పొరపాటున 'బావా!' అని పిలిస్తేనే చితక తన్నేదానివి చిన్నప్పుడు?" తల్లి కళ్ళల్లోని ఎరుపును గమనించి ఆగిపోయింది రుక్మిణి. చదువు ఆగిపోయిందన్న దుఃఖానికి తోడు చంద్రంతో తన పెళ్ళి అని తల్లి చెప్పినప్పుడీ క్రొత్త విపత్తు నెలా ఎదుర్కోవాలో తెలియక తబ్బిబ్బు పడిపోయింది రుక్మిణి

"అప్పటిదారి వేరు" తుంచేసినట్లుగా అంది వేదవతి.

'నిజమే. అప్పటి దారి వేరు. అప్పుడో పేద రైతు భార్య అత్త. డబ్బుగల దాన్ననే అహంకారంతో ఆమెనెంతగానో అవమానించేది అమ్మ. ఇంటి ఆడపడుచుకు చూపవలసిన కనీస ఆదరణ. ఆప్యాయత అత్త పట్ల చూపలేదు. విధివక్రించి తమది క్రింద చెయ్యి అయే సరికి యిప్పుడెక్కడలేని ప్రేమను నటించి ఆ అమాయకురాల్ని ఒప్పించి కానీ కట్నం లేకుండా మంచి ఉద్యోగస్తుడిని అల్లుడిగా కొట్టెయ్యాలని ప్లాన్ వేసిందన్నమాట!.....' తల్లి స్వభావాన్ని బాధగా గుర్తిస్తుంది రుక్మిణి.

"చంద్రాన్ని చేసుకోవడం యిష్టం లేదమ్మా నాకు." తల్లికి కోపం వస్తుందని భయపడుతూనే తన మనసులోని మాటను స్పష్టంగా చెప్పింది రుక్మిణి.

"ఏం? ఎందుకే నీకిష్టం లేంది? ఏం తక్కువయిందతనికి?" చర్రున లేచింది వేదవతి. తల్లి ఆక్రోశం చూస్తూంటే తిక్కగా, జాలిగా, దుఃఖంగా వుంది రుక్మిణికి. అమ్మ ఆలోచనల స్థాయి వేరు. తన ఆలోచనల స్థాయి వేరు.తనుచెప్పే కారణం చాలా హాస్యాస్పదంగా కనిపిస్తుందామెకు. ఐనా తప్పదు. అసలు విషయం చెప్పి నచ్చచెప్పి అమ్మను ఒప్పించాలి.

"నువ్వు కోపం తెచ్చుకోకుండా నేను చెప్పేది వినమ్మా! చంద్రాన్ని చేసుకుంటే మాకు పుట్టబోయే పిల్లలు చంద్రం తమ్ముడి లా అవకరంగా. తెలివితేటలు లేకుండా వుంటారేమోనని నా భయం. అత్త మేనరికం చేసుకోబట్టేకదా అలాంటి బిడ్డ పుట్టింది?"



"సింగినాదం కాదూ!! ఏం-మేనరికాలు చేసుకున్నవాళ్ళకే యిలాంటి పిల్లలు పుడుతున్నారా? బయటి సంబంధాలు చేసుకున్న వాళ్ళ కెవరికీ యిలాంటి పిల్లలు పుట్టడం లేదా? తీరి కూర్చున్నవాళ్ళు తిన్నదరక్క చేసే ప్రచారాలివన్నీ." కొట్టిపారేసింది వేదవతి.

"అది కాదమ్మా! మేనరికాలు మంచివి కావని సైన్సు నిరూపించింది. బయటి సంబంధాలు చేసుకున్నా అలాంటి పిల్లలు పుట్టొచ్చు. అది వేరేసంగతి. కాని మేనరికాలు చేసుకున్నవాళ్ళకిలాంటి పిల్లలు పుట్టే అవకాశం మిగతావాళ్ళకంటే ఎక్కువ. అత్తకి అలాంటి కొడుకున్నాక చంద్రం పిల్లలలా వుండే ఛాన్సు మరీ ఎక్కువ" ఓపిగ్గా వివరించసాగింది రుక్మిణి.

"మాయదారి సైన్సు కబుర్లు నాకు చెప్పకే! ఇప్పుడు మేనరికాలు చేసుకునే వాళ్ళందరికీ నీ మాత్రం జ్ఞానం లేదంటావా? ఎంతెంత చదువుకున్నవాళ్ళు సుబ్బరంగా మేనరికాల్ని చేసుకుంటున్నారు. ఏ కట్నం సరిపోకో, ఎదుటివారు నచ్చకో సైన్సు నడ్డు పెట్టుకుని తప్పించుకుంటున్నారు. తప్పితే సైన్సుమీద నమ్మకంతో మేనరికాల్ని మానేసినవాళ్ళను నేనింతవరకు చూళ్ళేదు. పిచ్చివాగుడు వాగుతూ బంగారమంటి సంబంధాన్ని కాలదన్నుకోకు!" అర్థంగావాదిస్తున్న తల్లికెలా నచ్చచెప్పాలో తోచక తండ్రి నాశ్రయించింది. తల్లి నోటికి జడిసిన తండ్రి తన అశక్తతను బయటపెట్టాక చంద్రంతో తన మనసు విప్పి చెప్పింది.

"ఎలా జరగాల్నుంటే అలా జరుగుతుంది రుక్కూ! జరగబోయేదాన్ని మనం ఆపగలమా చెప్పు? నువ్వు చెప్పేదాన్లో నాకే మాత్రం నమ్మకం లేదు" రుక్మిణి అభ్యర్థ

## పేషంట్ చెప్పే కథలు

నను ఒక్కమాటతో కొట్టిపారేశాడు చంద్రం. చిన్నప్పటినుంచి తమ పట్ల తిరస్కారం చూపుతున్న అత్త తమ కాళ్ళు పట్టుకుని దేవురించే స్థితికి వచ్చినందుకు సంతోషం. రుక్మిణిలాంటి అమ్మాయిని వదులుకోలేని స్వార్థం చంద్రాన్ని పావకాశంగా, సంస్కారవంతంగా ఆలోచించనివ్వలేదు. ఉక్రోషంతో, ఆవేశంతో అందరితో వాదించి వాదించి అలిసిపోయిన రుక్మిణిని తిట్టి, బెదిరించి బలవంతాన చంద్రానికి కట్టబెట్టిగాని శాంతించలేదు యింట్లో వాళ్ళు....

పాపాయి కీచుమని ఏడవడంతో గతాన్నుండి బయటపడింది రుక్మిణి. పాప భవిష్యత్తెలా వుంటుందో డాక్టరుగారు చెప్పారు. నిస్సారంగా, నిరుపయోగంగా, మహా భారంగా బ్రతికి అకాలంలో రాలిపోబోయే యీ పసికందులో పొంగే చైతన్యాన్ని, నిండు ఆయుషును నింపగల సామర్థ్యం ఎవరికుంది? ఆనాడు తన నమ్మకాలమీద దెబ్బకొడ్తూ సైన్సునవహేళనచేసిన ఏ ఒక్కరికైనా తన కన్నీటిని తుడవగల శక్తివుందా!!ఎంత పెద్ద హోదా, ఎంత గొప్ప సంపద తన బ్రతుకులోని యీలోటు పూడ్చగలవు!! ఎన్ని కర్మసిద్ధాంతాలు- ఎంత వేదాంతం తన గుండెల్లోని యీ మంటలనార్పగలవు!!

రుక్మిణి కళ్ళు వర్షిస్తున్నాయి. ప్రకృతి చెక్కిలి మీద కన్నీటి చుక్క జారింది.

—డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి